# గాలి వీచి పూల తీగా...

- ఎ. సువర్ణ



ఇవ్వాళ బాగా చీకటి పడి పోయింది అనుకుని నడక వేగం హెచ్చించాను. ఎంత వేగంగా నడిచినా నడక పదిహేను నిమిషాలు పట్టింది. ఒంటరిగా చీకట్లో రోడ్డు మీద నడచి వస్తున్నపుడు కలగని భయం ఇంటి దగ్గరకు వచ్చే సరికి పట్టుకుంది.

"ఎందుకే ఇంత ఆలస్యం ఇవ్వాళ... చీకటి పడకుండా ఇల్లు చేరుకోవాలనే జ్ఞానం లేదుటే...?" లోపలికొచ్చి ఇంకా చెప్పులు వదలకుండానే దాదాపు సింహంలా గర్జిస్తున్నట్టుగా ఉన్న అత్తయ్య మాటలకి వంట్లోంచి వణుకు పుట్టుకొచ్చింది.



"ఇప్పుడు టైమెంతే ఇందూ...? మాట్లాడవేం... టైమెంతని అడుగుతూంటే...?"

"ఎ.... ఎ ని మి ది ... న్నర..!"

"ఇంత చీకటి పడేంతవరకూ ఎక్కడున్నావు...?"

"కాలేజీలోనే వున్నాను అత్తయ్యా..."

"ఇంతసేపు కాలేజీలో ఏంచేస్తున్నావు...?"

"ప్రాక్టికల్స్ ... ప్రాక్టికల్స్ అత్తయ్యా ... లాబ్ అసిస్టెంట్ వచ్చే సరికీ ఆలస్యం అయింది.. ప్రయోగం పూర్తి చేసే సరికి చీకటి పడింది..."

" వూ ... అతగాడికి బుద్ధి వుండక్కర్లా ఆడపిల్లల్ని ఇంత రాత్రి వరకూ కాలేజీలో వుంచకూడదని... పో....పో.. వెళ్ళి కాళ్ళు చేతులు కడుక్కురా... అన్నాలు తిందాం".

అత్తయ్యమాటలకు బతుకు జీవుడా, లని బాత్ రూమ్‌లోకి వెళ్ళి తలుపులు గడియపెట్టుకున్నాను.

అత్తయ్యంటే ఇంట్లో అందరికీ సింహ స్వప్నం. ఆమెను చూస్తేనే అందరం గడ గడ లాడిపోతాం. ఆమె రూల్స్ మహా స్ట్రిక్టుగా వుంటాయి.

సూర్యోదయానికి ముందే అందరూ నిద్రలేవాలి, తెల్లారాక కూడా ఇంకా ఎవరైనా మంచం మీద పడుకుంటే అత్తయ్యకి మహా కోపం వస్తుంది.

"ఇంట్లో లక్ష్మి వుండనీకూడదనుకుంటున్నారా?" అని దరిద్రం మీద ఓ పెద్ద లెక్చరు ఇస్తుంది. పళ్ళు తోము కోకుండా ఎవరూ బెడ్ కాఫీ తాగకూడదు.

'ఒసేయ్ ఇందూ, అట్లా గోళ్ళు కొరక్కు...,'అంటూ శుక్రవారం, మంగళవారాల్లో గోళ్ళు తీసుకోనియ్యదు... నాన్నా అన్నయ్యలను మంగళ, శుక్ర వారాలలో సెలూన్‌కి వెళ్లనియ్యదు. ఇంకా ఎన్నో మూఢ విశ్వాసాలతో మమ్మల్ని విసుగిస్తుంది అత్తయ్య.. దీనికి తోడు మహా మడి. నిప్పు లు కడిగేంత మడి. దొడ్లో పంపు దగ్గర స్నానం చేసి మడి నీళ్ల పట్టి తెచ్చుకుంటూండగా ముట్టయా దూరంగా వున్న నేనో, అమ్మో... చెలో కనిపిస్తే 'ఓసి దౌర్భాగ్యురాలా కాసేపు చాటుగా వుండలేవూ... వాళ్ళు కనబడకుండా పో.. .' అని బిందెడు నీళ్ళు కుమ్మరించి పంపు దగ్గరకెళ్లి మళ్లీ స్నానం చేసి మడి నీళ్లు పట్టి తెచ్చుకుంటుంది. ఎప్పుడైనా ఎక్కడైనా ఓ నూలు పోగు పొరపాటున తొక్కినా అదే గతి.

అత్తయ్యకి అనుమానాలు ఎక్కువే. మాతో కాలేజీలో చదువుకునే అబ్బాయి ఎవరైనా ఏవైనా పుస్తకాల కోసం వచ్చి మాట్లాడుతూంటే మా ఎదురుగుండానే కూర్చుం

టుంది అత్తయ్య.

వాళ్లు వెళ్లి పోయాక "ఆ అబ్బాయికి అంతగా పుస్తకాలు కావాల్సి వస్తే మరో మగబ్బాయి దగ్గరకు వెళ్ళచ్చుగా...నీ దగ్గర... ఆడపిల్లవు... నిన్నడగడం ఏమిటే ఇందూ..." అని మెత్త మెత్తగా చివాట్లు వేసేది.

"ఇన్ని ఆడపిల్లల కాలేజీ లుండగా మగ పిల్లల కాలేజీలో ఎందుకురా చేర్చావు తమ్ముడూ" అని నాన్నని కేకలేసేది.

నాన్నకి అత్తయ్యంటే మహా భయభక్తులు... చిన్నప్పుడే పెళ్ళయి భర్తని పోగొట్టుకుని బాల వితంతువుగా పుట్టింటికి వచ్చేసింది అత్తయ్య.

నాయనమ్మ నాన్నని కని, కళ్ళు మూస్తే తమ్ముని పెంపకం బాధ్యతంతా అక్కమీద పడింది. అత్తయ నుంచి పెంపకం, క్రమ శిక్షణలో పెరిగిన నాన్న ఇవాళింత పెద్ద ఆఫీసరైయ్యారు. అత్తయ్య ఎదురుగుండా నిల్చుని మాట్లాడేందుకు నాన్నకి భయమే.

అత్తయ్య తీర్థ యాత్రలకని వెళ్లాక అన్నయ్య గుట్టు రట్టయ్యింది.

ఆచారవంతురాలూ, సాంప్రదాయాలను గౌరవించే అత్తయ్యకి అన్నయ్య చేసిన పని తెలిస్తే...

అన్నయ్య ఎందుకిట్లా చేశాడు...ఎంతో డీసెంట్ జెంటిల్ మెన్, బాంకులో ఆఫీసరుగా ఉద్యోగం చేస్తున్నాడు. కాలేజీలో చదివినన్నాళ్లు పక్క బెంచీలో కూర్చున్న అమ్మాయినే కన్నెత్తి చూడని, పన్నెత్తి పలకరించని యోగ్యుడు. ఏ ఆడపిల్ల అయినా అన్నయ్యతో స్నేహంగా వుండాలనుకుని దగ్గరగా వస్తే ఆమడ దూరం పరిగెత్తే అపర ప్రవరుడు.

అలాంటి అన్నయ్య ఎదురింటి డాక్టరుగారి చెల్లెల్ని ప్రేమించాడు. ప్రేమించడం మాత్రమే కాదు.. ఆమెనే పెళ్ళి చేసుకుంటానని పట్టుబట్టాడు.

ప్రేమించడం తప్పనడం లేదు, పెళ్లి చేసుకోవడం తప్పు కాదు....కాని అన్నింటా అర్హులైన వీళ్లని ప్రేమించాలి పెళ్లి చేసుకోవాలి.... ఎదురింటి అమ్మాయి సుమంగళి అందమైనదే ప్రేమించి పెళ్ళి చేసుకోదగినదే... కానీ... ఆమె విడో... ఓ కొడుకుని కన్న తల్లి.. అలాంటి అమ్మాయిని అన్నయ్య పెళ్లి చేసుకునేందుకు అత్తయ్య ససేమిరా ఒప్పుకోదు.

వైధవ్యంతో వచ్చిన సుమంగళితో అన్నయ్య నాల్గైదు నెలలునుండి స్నేహంగా వుంటున్నాడని తెలిసింది. సుమంగళి మహా అందెగత్తె ఏం కాదు. ఆమెను మించిన ఎంతోమంది అందగత్తెలు అన్నయ్య మీద వల విసిరితే అన్నయ్య ఆ వలలో చిక్కలేదు.... అయితే మరిట్లా జరిగింది.. కారణం నా బుర్రకి తట్టక అన్నయ్యనే అడిగేశాను.

"వురేయ్.... అన్నయ్యా సుమంగళి అందం చూసి మోహించావా...."

"షటప్...?"

"ఓ విధవకి కొత్త జీవితం ఇచ్చే సంఘ సంస్కర్త వనిపించుకోవాలనా... లేక ఆమె మీద జాలితోనా?'

"స్టుపిడ్... సుమంగళి ఇదే ప్రశ్న నన్నడిగింది. అట్లా జాలితో తననెవరూ పెళ్లి చేసుకోలేరంది. తనకెవరి జాలీ అక్కర లేదని ఖచ్చితంగా చెప్పింది".

"మరెందుకు నీకు ఆమె మీద అంత గాఢమైన ప్రేమ పుట్టింది...? ఏం చూసి మనస్సు పారేసుకున్నావు."

"అది ప్రేమించిన మనస్సునడుగు! చూసిన కళ్లనడుగు! నోటికేంతెలుసు చెప్పడానికి, తావలిచింది రంభ అనే సామెతని వినలేదూ నువ్వూ.."

అన్నయ్య చెప్పిన నిర్వచనానికి పులకించిపోయాను. అన్నయ్యని సందేహించక్కర లేదు, వాడిది పవిత్రమైన ప్రేమే...! కానీ....అత్తయ్యని తల్చుకుంటేనే గుండెలదరి పోతున్నాయి. అయింది ఇంకొక్క వారంలో తీర్థయాత్రల కెళ్ళిన అత్తయ్య తిరిగి వచ్చేస్తుంది.

" అన్నయ్య ప్రేమ వ్యవహారం విన్నదంటే ఇంట్లో పెద్ద భూకంపమే వస్తుంది."

అత్తయ్య రేపు పొద్దున వస్తుంది. వచ్చి ఏం ప్రళయం సృష్టిస్తుందో.. అన్న. భయంతో నాకారాత్రి కలత నిద్రే అయింది.

నాన్న అత్తయ్యని స్టేషన్ నుంచి తీసుకురావడానికి వెళ్ళి అరగంట దాటింది. ఇప్పుడో, ఇంకాసేపట్లోనో వచ్చేస్తారు. అమ్మ అయితే చలి జ్వరం వచ్చిన దానిలా వణికిపోతుంది. నేనూ చెల్లీ గజ గజలాడి పోతున్నాము. అన్నయ్య మాత్రం ధైర్యంగా మేడ మీద 'హిందూ' చదువుకుంటున్నాడు... వాడికి మొండి ధైర్యం.

"అత్తయ్యకి ఇష్టం లేకపోతే దేముడి ముందు మాలలు మార్చుకొని రిజిస్టర్ పెళ్లి చేసుకుంటాము...ఈ ఇంట్లో వుండము... వెళ్ళి పోతాము అంతేకానీ వేరే ఇంకో అమ్మాయి మెడలో తాళి కట్టను పెళ్లంటూ చేసుకుంటే సుమంగళినే చేసుకుంటాను..."అని ఖచ్చితంగా చెప్పేశాడు.

వాకిట్లో ఆటో ఆగిన చప్పుడుకి ఆలోచనల నుంచి బయటకొచ్చాను. అమ్మ అత్తయ్యకి స్వాగతం పలికేందుకు వాకిట్లోకి పరిగెత్తిన అడుగుల చప్పుడు వినిపించింది.

మేము బయటికి రాకుండా వెంకటాచలపతిని ప్రార్థిస్తున్నాము.

"ఏం వదినా తీర్థయాత్రలు బాగా జరిగాయా...?" అమ్మ ఆడబడుచుని కుశలం అడగడం వినిపించింది.

"ఆ...బాగానే జరిగాయి! అబ్బ ఈ హైద్రాబాదులో ఎండలు ఏం మండిపోతున్నాయి. అక్కడంతా చల్లగా ఉంది. శృంగేరిలో మహాచలి.... శృంగేరి శారదాంబని కన్నులపండువగా దర్శించుకున్నాను. ఉడిపి, ధర్మస్థలిలో వానలు జోరుగా కురుస్తున్నా ఒకటే ఉక్క....".

అత్తయ్యని పలకరించాలని మేము ధైర్యం చేసుకుని గదిలోంచి బయటికొచ్చి "అత్తయ్యా! ఇన్నాళ్లు వుండ పోయావేమిటి తీర్థయాత్రలని....అన్నీ చూశావా...?' అడిగాము.

"ఆ..అన్నీ చూశాను...మీరిద్దరూ ఏమిటిట్లా చిక్కి పోయారు.. రాత్రిళ్లు చాలా సేపు మేలుకుని పరీక్షలకు చదువుతున్నారా...." అని అత్తయ్య అంటూండగానే అన్నయ్య చేతిలో పేపరుతో వచ్చాడు, వీడిని చూస్తూనే అత్తయ్య ...

"ఏమిట్రా ఇంక సన్నబడిపోయావు...సరిగ్గా అన్నం తినడం లేదా..." అమ్మో ఎనభై ఏళ్ళు దాటుతున్నా కంఠం




కొలనుపాక బాలరాజు సన్నాఫ్ కె. వెంకటేశ్ గ్రా: గుండ్లెగూడెం, మం: ఆలేరు, జిల్లా : నల్గొండ

కంచులా మోగుతోందనుకున్నాను.

"లేవండి వదినా! స్నానం చేసి భోజనం చేద్దురుగానీ, తెల్లారి తలోరా స్నానం చేసి మడి కట్టుకుని వంట చేశాను" అని ఆడబడుచుని మర్యాద చేసింది.

అత్తయ్య స్నానం చేసి దేవతార్చన చేసి అందరినీ పేరు పేరునా పిల్చి తీర్థ ప్రసాదాలు ఇచ్చింది.

భోజనం చేసి వచ్చి ఉయ్యాల బల్ల మీద పడుకుని విశ్రాంతి తీసుకుంటోంది అత్తయ్య.

అక్కడే కుర్చీలో కూర్చున్న నాన్నని చూస్తూ..."వురేయ్ అబ్బాయ్, నేను వూళ్లో లేనప్పుడు జరిగిన విశేషాలు చెప్పరా...." అని అడిగేసరికి నాన్నలో భయం పరాకాష్టకి చేరుకుంది.

అది చూసి **నేను** ధైర్యం కూడదీసుకుని "నాన్నా! జరిగిందంతా అత్తయ్యకి చెప్పెయ్యి....వూరికే భయపడుతూ కూర్చోకు.." అన్నాను.

అత్తయ్య అర్థంకాక తెల్లమొహం వేసి"ఏమిట్రా అబ్బాయ్! ఇందిర ఇట్లా అంటోందేమిటి...?"అని అడిగింది నాన్నని.

ఇంక నాన్నకి చెప్పక తప్పలేదు. "అక్కయ్యా ఇట్లా రా..." అంటూ పడుకున్న అత్తయ్య చెయ్యి పట్టుకు లేవదీసి స్టోర్ రూమ్‌లోకి తీసికెళ్ళి నాన్న తలుపులేసి లోపల గడియ పెట్టాడు.

క్షణాలు నిముషాలుగా మారుతున్నాయి, నిముషాలు గంటలుగా మారడానికి కొద్ది క్షణాలు మాత్రమే వున్నాయి.

అందరికి ఆదుర్దాగా తలుపులు ఎప్పుడు తెరుచుకుంటాయానని తలుపు వైపు చూస్తున్నాం.

ధడులున తలుపు తెరుచుకుని తుఫానులా బయటి కొచ్చింది. అత్తయ్య వెనకాలే నాన్న బిక్క మొహం వేసుకు వచ్చాడు.

"అయిపోయింది, తుఫాను అతి భయంకరంగా విజృంభింపబోతోంది" అని అందరం ప్రాణాలు అరచేతిలో పెట్టుకు కూర్చున్నాము.

హాల్లో కుర్చీలో కూర్చుంది అత్తయ్య.

"ఒరేయ్ మాధవా..."అని గర్జించింది.

"ఆ వస్తున్నా..."అని నిదానంగా చేతిలో ఏదో పత్రిక పట్టుకుని మెట్లు దిగివస్తున్నాడు అన్నయ్య.

"ఏమిటత్తయ్యా...ఎందుకుపిల్చావు...?"అని అడిగాడు అన్నయ్య. అన్నయ్యపని గోవిందా అనుకున్నాను.

"చెబుతా ...ఒసేయ్ శకుంతలా..." పిల్చింది అత్తయ్య. గాభరాపడుతూ పూజగదిలోంచి వస్తూ.

"ఏమిటొదినా..."అని అడిగింది భయం భయంగా అమ్మ.

"వెళ్ళి ఆ సుమంగళిని తీసుకురా..."ఆజ్ఞాపించింది అత్తయ్య.

"ఎందుకండీ..?"ఆ అమ్మాయిని కొడుతుందో తిడుతుందో అన్న బెదురుతోనే అడిగింది అమ్మ.

"ఎందుకూ?...ఏమిటీ? అని అడక్కు వెళ్ళి పిల్చుకురా అంటే పిల్చుకురా అంతే..." అమ్మ మరేం మాట్లాడకుండా వెళ్లి సుమంగళితో తిరిగి వచ్చింది.

అంతవరకూ ప్రశాంతంగా వున్న అన్నయ్య మొహంలో కలవరం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.

అమ్మని దగ్గరగా పిల్చి చెవిలో ఏదో చెప్పింది అత్తయ్య.

అమ్మ మొహంలో ఆశ్చర్యం... తలాడించి పూజగదిలోకి వెళ్ళిన అమ్మవెళ్ళిన అమ్మ అక్షింతల గిన్నెతో తిరిగి వచ్చింది.

అందరికీ సస్పెన్స్.... ఏం జరగబోతోంది అని ఆందోళనగా చూస్తున్నాము.

"వురేయ్ మాధవా! నువ్వూ, సుమంగళీ అమ్మ



నాన్నలకి నమస్కరించండి! ఇంద అక్షింతలు! వాళ్లని ఆశీర్వదించండర్రా..."అని అత్తయ్య అమ్మ నాన్నల చేతుల్లో అక్షింతలుంచింది.

అమ్మా నాన్న జరిగేదేమిటో అర్థంకాకుండానే అన్నయ్యా సుమంగళిలను ఆశీర్వదించారు.

తరవాత అన్నయ్యా, సుమంగళిలు అత్తయ్య కాళ్ళకి నమస్కరించారు .

మాట్లాడేందుకు మాటలురాక అత్తయ్య సుమంగళి గుండెలకి హత్తుకుని వెక్కి వెక్కి ఏడిచింది....భోరునా ఏడిచింది.

మాకెవరికీ బాధతో నోట మాటరాలేదు.

"అమ్మా సుమంగళీ! యాభై సంవత్సరాల కిందట నేనూ నీలాగే భర్తను పోగొట్టుకుని పుట్టింటికి చేరాను. చీకటైపోయిన నాజీవితంలో వెలుగు చూపించే వాళ్ళే లేక పోయారు. నీకు అలా కాకూడదమ్మా...నీ జీవితానికి వెలుగునిస్తాను. నా మేనల్లుడ్ని వివాహం చేసుకుని నిండు నూరేళ్ళూ సుమంగళిగా వర్ధిల్లమ్మా.."అని ఆశీర్వదించింది అత్తయ్య.

మా అందరికీ కళ్ళల్లో ఆనంద బాష్పాలు.


ఆహా...అత్తయ్యా...! మూఢ సాంప్రదాయాలను మూర్ఖంగా పట్టుకు కూర్చోకుండా సమాజంలో వచ్చే కొత్త మార్పులకి స్వాగతం పలికే నూతన శకానికి ప్రతినిధి అత్తయ్య!!

మొక్క మొక్కలానే వాడిపోకుండా చూసే తోటమాలి అత్తయ్య!!!

విధవా వివాహాలుచెయ్యాలని కంకణం కట్టుకున్న 'కందుకూరి' అత్తయ్యలో కనిపిస్తున్నాడు.

ఇలాంటి వృద్ధ మహిళలు ఇంటికొకరుంటే - ఆ ఇల్లే స్వర్గ సీమ.

ఎ. సువర్ణ
ఇం.నెం.17,జ్యోతినికేతన్
సి.ఐ.ఎల్.సి. కాలనీ, సంజయ్‌నగర్,
బెంగళూరు-560 094.




డి. శ్రీధర్, కొండాపురం, రాయదుర్గం తాలూకా, అనంతపురం జిల్లా